క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



పెనుగంచిప్రోలు: అధిక వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెనుగంచిప్రోలు ఎంపీడీఓ సాయిహర్ష, సర్పంచి వేల్పుల పద్మకుమారి సూచించారు. పెనుగంచిప్రోలు చెరువును శనివారం రాత్రి పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజలకు జాగ్రత్తలు తెలియజేశారు. సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేల్పుల రవికుమార్, మండల పరిషత్ కార్యాలయ ఏవో సిద్ధారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై పారుతున్న వరదనీరు

కంచికచర్ల : నందిగామ మండలం తోటచర్ల వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై శనివారం వరదనీరు చేరింది. దీంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట చెరువుకట్ట నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు తోటచర్ల హైవేపై పాపారుతుండటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అయితే పోలీసులు హైదరాబాద్ వైపునకు వెళ్లే రెండో వైపు ఉన్న రోడ్డులో అక్కడక్కడ ప్లాస్టిక్ బారిగేడ్లు ఏర్పాటు చేసి ఇరువైపులా వాహనాలను రాకపోకలు సాగించేలా చేశారు. అయితే హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను సూర్యాపేట లేదా కోదాడ నుంచి ఖమ్మం మీదుగా వాహనాలు వెళ్లాలని అధికారులు సూచించారు.

ఉధృతంగా కృష్ణమ్మ



జగ్గయ్యపేట: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌ల నుంచి దిగువకు నీరు విడుదల కారణంగా ముక్త్యాల గ్రామ సమీపంలోని పులిచింతల ప్రాజెక్ట్ నుంచి 4లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణమ్మ ఉధృతంగానే ప్రవహిస్తోంది. కృష్ణానది పరివాహక గ్రామాలైన ముక్త్యాల, వేదాద్రి, రావిరాల గ్రామాల్లోని పుష్కరఘాట్లు మూడురోజులుగా నీటిలోనే ఉన్నాయి.

ఇబ్బందుల్లో ప్రాజెక్టు అధికారులు



జగ్గయ్యపేట: భారీ వర్షాలకు వరదలు, వాగులు పొంగిపొర్లుతుండటంతో శనివారం డ్యూటీకి వెళ్లే పులిచింతల ప్రాజెక్ట్ అధికారులు అనేక ఇబ్బందులు పడ్డారు. జగ్గయ్యపేట నుంచి పులిచింతలకు వెళ్లేందుకు మార్గంమధ్యలో తెలంగాణ రాష్ట్రం వజినేపల్లి వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో 10మంది సిబ్బంది ఇబ్బందిపడ్డారు. దాదాపు రెండుగంటల అనంతరం స్థానికుల సూచనల మేరకు దొండపాడు మీదుగా రెండుజిల్లాలు దాటుతూ విధులకు హాజరయ్యారు.

నీట మునిగిన సబ్‌స్టేషన్



కంచికచర్ల : భారీ వర్షాలకు కీసర విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వర్షపునీరు చేరడంతో సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలోని కీసర, గండేపల్లి, పెండ్యాల, వేములపల్లి, శౌరీ అమరవరం గ్రామాలకు శనివారం ఉదయం 11గంటల నుంచి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఆయాగ్రామాల ప్రజలు అవస్థలుపడుతున్నారు. సబ్‌స్టేషన్‌లో మోకాలిలోతు నీరు నిలిచిపోయింది. దీంతో ఇబ్బందిపడుతున్నారు. . సబ్‌స్టేషన్‌లో వర్షపునీరు తగ్గాక ఆయాగ్రామాలకు విద్యుత్‌సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

కార్మికులను కాపాడిన ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

కంచికచర్ల : పరిటాల చెరువుకట్ట తెగడంతో పాటు ఉధృతంగా ప్రవహిస్తున్న ఏనుగుగడ్డ వాగు వరద ఉధృతికి పరిటాల న్యూకాన్ బ్లాక్స్ కంపెనీ సిబ్బంది శనివారం బయటకు రాలేని దుస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించి వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. దీంతో కర్మాగారంలో పనిచేసే సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు.

ఇన్‌చార్జిల నియామకం

కంచికచర్ల : కీసర ఇసుక స్టాక్ పాయింట్ ఇన్‌చార్జిగా నందిగామ డిప్యూటీ తహసీల్దార్ జే శ్రీరాములు, మోగులూరు స్టాక్ పాయింట్ ఇన్‌చార్జిగా కంచికచర్ల డిప్యూటీ తహసీల్దార్ ఎస్.అనూష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జేసీ నిధిమీనా ఉత్తర్వులు జారీచేశారు.

భారీవర్షాలతో అతలాకుతలం

- ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షం..
- నందిగామ డివిజన్‌లో 682.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- రోడ్లన్నీ జలమయం
- పొంగుతున్న వాగులు, వంకలు
- నీటమునిగిన పొలాలు
- జనజీవనం అస్తవ్యస్తం



నందిగామలో ముంపు ప్రాంతాలు పరిశీలిస్తున్న ఆర్డీవో ఎ.రవీంద్రరావు

కంచికచర్ల : ఎడతెరిపి లేకుండా శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. భారీ వర్షానికి వాగులు పొంగిపొర్లుతున్నాయి. పంటపొలాలు నీటమునిగాయి. నందిగామ డివిజన్‌లో 682.0మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. కంచికచర్లలో 100.2మి.మీ, నందిగామలో 103.6, చందర్లపాడులో 110.2, వీరులపాడులో 103.2, జగ్గయ్యపేటలో 81.4, పెనుగంచిప్రోలులో 88.6, వత్సవాయిలో 94.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల ఆర్టీసీ బస్‌స్టాండ్, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలు, కేడీసీసీ బ్యాంకు ఆవరణలో వర్షపునీరు మోకాలిలోతులో నిలిచింది. ఇందికాలనీలో వర్షపునీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. జుజ్జూరు రోడ్డు పూర్తిగా జలమయమైంది. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 50ఏళ్లగా ఉన్న పెద్ద చింత చెట్టు విరిగిపడింది. ఎంపీడీఓ కె.శిల్ప స్పందించి చింతచెట్టు కొమ్మలను నరికించి జేసీబీ సాయంతో అక్కడ్నుంచి నుంచి తొలగించేశారు.

వాగులో కొట్టుకుపోయిన బైక్..

మండలంలోని చెవిటికల్లు వెళ్లే లక్ష్మయ్య వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎవ్వరూ వాగుదాటే ప్రయత్నం చేయకుండా పోలీస్‌కానిస్టేబుల్ రవీంద్ర, వీఆర్వో కావాటి హరిత కాపలాకాస్తున్నారు. కంచికచర్ల -బత్తినపాడు వెళ్లే నల్లవాగును ఎస్‌ఐ బీ రాజు పరిశీలించారు. కీసర-గండేపల్లి మధ్య కస్తవవాగు, కీసర, పెండ్యాల వాగు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. గండేపల్లికి చెందిన సంఘం సన్నీ అనేవ్యక్తి బైక్‌పై కస్తవ వాగును దాటేందుకు యత్నించగా, వాగు ఉధృతికి బైక్ కొట్టుకుపోయింది. ప్రమాదం నుంచి సన్నీ బయటపడటంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. నేషనల్ హైవే సమీపంలోని నల్లవాగు పొంగటంతో చిక్కుకుపోయిన కంచికచర్లకు చెందిన పశువుల కాపరులు అయిలపోగు రమేష్, గొల్ల వంశీకృష్ణలను అధికారులు నాటు పడవ ద్వారా సురక్షితంగా రక్షించారు.

తెగిన పరిటాల చెరువుకట్ట

భారీ వర్షాలకు మండలంలోని పరిటాల చెరువు కట్ట శనివారం తెగింది. దీంతో చెరువుకట్ట సమీపంలో నివాసముంటున్న 150కుటుంబాల ఇళ్లలోకి వరదనీరు చేరింది. అప్రమత్తమైన అధికారులు స్థానిక నాయకుల సహకారంతో నిర్వాసితులను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. తహసీల్దార్ వీ జాహ్నవి, ఎస్‌ఐ రాజు దాతలసహకారంతో వారికి భోజనవసతి కల్పించారు.



శనగపాడు వద్ద వాగులో కొట్టుకుపోతున్న ఆటో



పరిటాల పునరావాస కేంద్రంలో ఉన్న నిర్వాసితులు

పెనుగంచిప్రోలులో కుండపోత వర్షం

పెనుగంచిప్రోలు: వాయుగుండం ప్రభావంతో పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలంలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ముచ్చింతాల సమీపంలోని గండివాగు, అనిగండ్లపాడు వద్ద కూచివాగు కూడా వరద నీరు పెద్దఎత్తున చేరడంతో శనివారం తెల్లవారుజామునుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వర్షాలకు వరి పంట పొలాలు నీట మునిగాయి. లింగగూడెం వద్ద గండివాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పెనుగంచిప్రోలుకు-లింగగూడెంకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ముచ్చింతాల-తాళ్లూరు మధ్య, గుమ్మడిదుర్రు వద్ద వాగులతో పాటు ముండ్లపాడులో గండివాగు పొంగిపొర్లుతుండటంతో గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ముండ్లపాడు వద్ద మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో గండివాగుకు అడ్డుపడిన తూటు కాడను తొలగించారు. పెనుగంచిప్రోలు-ముండ్లపాడు రోడ్డులో చెరువు అలుగులు వద్ద చప్టాపై చెరువు నుంచి నీరు పెద్దఎత్తున చేరడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. వాగుల వద్ద పెనుగంచిప్రోలు ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున్ ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

వత్సవాయి మండలంలో...

మండలంలో వర్ష ప్రభావంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. మక్కపేట వద్ద రైల్వే అండర్‌పాస్ కింద వర్షపు నీరు భారీగా చేరటంతో వాహనదారులు అవస్థలుపడ్డారు. రోడ్లన్నీ జలమయమయ్యాయి. భీమవరంలో వర్షపు నీరు ఇళ్ల మధ్య చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులుపడ్డారు. వర్షాలకు ఆయా గ్రామాల్లోని పంటపొలాలు నీటమునిగాయి.

నందిగామలో స్తంభించిన జనజీవనం...

నందిగామ టౌన్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నందిగామ పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో జనజీవనం స్తంభించింది. మండలంలోని అయా గ్రామాలకు అనుసంధానంగా ఉన్న ఆర్అండ్‌బి, పంచాయతీ రహదారులపై ఉన్న చప్టాలపై వాగులు పొంగిపొర్లుతున్నాయి. రెవిన్యూ, పోలీస్ అధికారులు వాగులు, చెరువులు పరిశీలించి రాకపోకలు నిలిపివేయటంతోపాటు హెచ్చరికలు చేశారు. నందిగామ నుంచి చందర్లపాడు వెళ్లేరోడ్డులోని ముప్పాళ్ల వద్ద వాగు ద్విచక్ర వాహనంపై దాటేందుకు యత్నించిన ఓవ్యక్తి వరద నీటిలో కొట్టుకుపోతుండగా, గమనించిన స్థానికులు తాడుసాయంతో అతనిని కాపాడారు. విషయం తెలుసుకున్న నందిగామ సీఐ వైవీఎల్ నాయుడు ముప్పాళ్లవాగు వద్దకు చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకోవటంతోపాటు రాకపోకలు నిలుపుదల చేశారు. డీవీఆర్ కాలనీ, బస్టాండ్ ప్రాంతాల్లో వరదనీరు ఇళ్లల్లోకి చేరటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నందిగామ, చందాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లోకి నాలుగు అడుగుల మేర వరద నీరు చేరటంతో నందిగామ పట్టణానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చిల్లకల్లు నుంచి వచ్చే మెయిన్ లైన్ కూడా తెగిపోవడంతో విద్యుత్ సరఫరా లేక ప్రజలు అవస్థలుపడుతున్నారు. దీంతో నందిగామ అంతా అంధకారంగా మారింది.



చందాపురం వాగు వద్ద వివరాలు తెలుసుకుంటున్న నందిగామ సీఐ వైవీఎల్ నాయుడు



జగ్గయ్యపేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు ఉపనది

స్తంభించిన జనజీవనం

జగ్గయ్యపేట: అల్పపీడన ప్రభావంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జగ్గయ్యపేట నియోజకవర్గంలో వాగులు వంకలు పొంగిపొర్లుతుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాల కారణంగా జనం ఇళ్లకే పరిమితమయ్యారు. నియోజకవర్గంలోని కృష్ణానది, పాలేరు, మునేరు ఉపనదులకు కూడా వరదనీరు రావడంతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జగ్గయ్యపేట పట్టణంలో వేపలవాగు, ఎర్రకాలువ, ఊరచెరువులు ఉధృతంగా ప్రవహించడంతో అయ్యప్పనగర్, ఎర్రకాలువ నిర్వాసిత ప్రాంతాల్లో వరదనీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఉప్పొంగిన చెరువు..

ఎడతెరపి లేని వర్షం కారణంగా జగ్గయ్యపేట-వేదాద్రి రహదారిలోని పట్టణ పంప్‌హౌస్ వద్ద చెరువు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జయంతిపురం, ధర్మవరప్పాడుతండా, బుదవాడ, గండ్రాయి గ్రామాల్లోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోచంపల్లి, గుండబోయినపాలెం రహదారిలోని గండివాగు వరద రావడంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహశీల్దార్ ఎస్.నాగరాజు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. పంటపొలాల్లోకి వరదనీరు చేరడంతో వరి, పత్తి, మిర్చి పంటలు పూర్తిగా నీటమునిగాయి. బూదవాడ, అన్నవరం గ్రామాల్లో పాలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

పల్లపు ప్రాంతాలు జలమయం...

జగ్గయ్యపేట అర్బన్: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జగ్గయ్యపేట పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయ్యాయి. డ్రెయిన్లు పొంగిపొర్లాయి. అనేకచోట్ల రోడ్లపైకి నీరు చేరటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలోని పల్లపు ప్రాంతాలైన



పేటలో ఆర్‌సీఎం చర్చి రోడ్డులో చెరువును తలపిస్తున్న వరద నీరు

జెడ్పీ బాలుర హైస్కూల్ రోడ్డు, కోదాడ రోడ్డు, ఆర్టీసీ డిపో సెంటర్, వేపలవాగు ప్రాంతం, పాత ఎస్ఎస్‌పీ కాలనీ రోడ్‌లో ట్రాన్స్‌కో ఇండోర్ సబ్‌స్టేషన్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎర్రకాలువ, వేపలవాగు పొంగిపోవడంతో రోడ్లపైకి, గృహాల్లోకి వర్షపునీరు చేరింది. వరదనీరు రోడ్లపైకి చేరడంతో స్థానికులు అవస్థలుపడ్డారు. భారీ వర్షాల కారణంగా జనం ఇళ్లకే పరిమితమయ్యారు.

ముంచెత్తిన వరద నీరు..

తుఫాను ప్రభావంతో జగ్గయ్యపేట పట్టణాన్ని వరదనీరు ముంచెత్తింది. పట్టణం గుండా ప్రవహించే ఎర్రకాలువ, వేపలవాగుకు వరద ముంపు ఏర్పడటంతో అవి పొంగి ప్రవహిస్తున్నాయి. చింతల తోపు, డాంగేనగర్, ఆర్టీసీ కాలనీ, కాకానినగర్, యానాదుల కాలనీ, శివగంగ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లపై ఐదు అడుగుల మేర వరదనీరు ప్రవహించింది. చాలా చోట్ల ఇళ్లలోకి వరదనీరు చొచ్చుకువచ్చింది. చెరువుకు గండి కొట్టాలని పలువురు స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. బలుసుపాడు రోడ్‌లో ఇండేన్ గ్యాస్ కంపెనీ వద్ద చిన్నేరు పొంగిపొర్లుతుండటంతో అన్నవరం, బలుసుపాడు, బూదవాడ, హైవే నుంచి జగ్గయ్యపేటకు రాకపోకలు నిలిచిపోయాయి.



జగ్గయ్యపేట పట్టణం చింతలతోపు ప్రాంతంలో ఇళ్లను చుట్టుముట్టిన వరదనీరు



కంచికచర్లలో జలమయమైన ఎర్రుపాలెం రోడ్డు



అనిగండ్లపాడు వద్ద రోడ్డు, పొలాలు కనిపించకుండా ప్రవహిస్తున్న వాగు



మక్కపేట రైల్వే అండర్‌పాస్ వద్ద వరద నీటి ఉధృతిలో వస్తున్న బస్సు



పెనుగంచిప్రోలు టౌన్ సెంటర్‌లో వరద ప్రవాహం

సిబ్బంది తీరును తప్పుపట్టిన కౌన్సిల్



మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావును సన్మానిస్తున్న చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్లు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ సిబ్బంది తమ పనితీరు మార్చుకోకపోతే కఠినచర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర హెచ్చరించారు. జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ప్రతిపక్ష సభ్యురాలు కన్నెబోయిన రామలక్ష్మి మాట్లాడుతూ గతంలో కౌన్సిల్ చేసిన తీర్మానాలు అమలు చేయడంలేదని సమావేశం దృష్టికి తెచ్చారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ మున్సిపల్ సిబ్బంది, పట్టణ పరిధిలోని ఆయా సచివాలయాల ఉద్యోగులు తీరును తప్పుపట్టారు. తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. పట్టణంలో పారిశుధ్య వ్యవస్థ పూర్తిగా వైఫల్యం చెందడానికి శానిటరీ ఇన్‌స్పెక్టరే కారణమంటూ ఆయనను సస్పెండ్ చేయాలని పాలక, ప్రతిపక్ష సభ్యులు ముక్తకంఠంతో చైర్మన్‌ను కోరారు. ఆఫీసులోనే నిద్రిస్తున్నాడంటూ కౌన్సిలర్ మనోహర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫొటోను ప్రదర్శించారు. కమిషనర్ కారు టెండర్ విషయం అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. అజెండాలోని అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు ఉద్యోగవిరమణ చేస్తుండటంతో చైర్మన్, కౌన్సిల్ సభ్యులు ఆయన సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు హాఫీజున్నీసా, తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నీట నానుతున్న పంటపొలాలు

కంచికచర్ల : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రైతులు సాగుచేసిన పంట పొలాలన్నీ నీటిలో తేలియాడుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించి పంటలు చేతికొచ్చే సమయంలో నీటిలో మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీవర్షాలకు కంచికచర్ల, పరిటాల, పేరకలపాడు, మోగులూరు, గండేపల్లి, కీసర, పెండ్యాల, చెవిటికల్లు గనిఆత్కూరు తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన పత్తి, మొక్కజొన్న చేలల్లో నీరు నిలబడింది. చేతికొచ్చిన పెసర పంట నీటిలో మునిగిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు కంచికచర్లలో 25 సెంటీమీటర్ల వర్షం కురిసిందని అధికారులు చెబుతున్నారు. మరో రెండురోజులపాటు ఇదే విధంగా వర్షంకురిస్తే పంటలన్నీ దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పేరకలపాడులో చెరువును తలపిస్తున్న పత్తిచేను

ఉధృతంగా వైరా-కట్టలేరు



పెద్దాపురం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఏనుగుగడ్డ వాగు

వీరులపాడు : భారీ వర్షాలకు వీరులపాడు మండలంలో జనజీవనం స్తంభించింది.వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వేలాది ఎకరాల పంటపొలాలు నీటమునిగాయి. వైరా కట్టలేరు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో వీరులపాడు- కంచికచర్ల మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ముఖ్యంగా వైరా కట్టలేరు, ఏనుగుగడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కొణతాలపల్లి, పల్లంపల్లి, వెల్లంకి, తాటిగుమ్మి, నందలూరు, పెద్దాపురం, జుజ్జూరు, నరసింహారావుపాలెం, జయంతి గ్రామాల పరిధిలోని పంటలు నీటమునిగాయి. ఏనుగుగడ్డ వాగు ఉధృతికి పెద్దాపురం, గూడెం మాధవరం, జుజ్జూరు, రంగాపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గూడెం మాధవరం చెరువు నుంచి వరదనీరు గ్రామంలోకి రావడంతో లోతట్టు ప్రాంతంలోని ఇళ్లు జలమయమయ్యాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏనుగుగడ్డ వాగు ఉధృతిని తహసీల్దార్ రాజకిషోర్ పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలకు ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు.



జుజ్జూరు-రంగాపురం వద్ద వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజకిషోర్

కమిషనర్ సేవలు స్ఫూర్తిదాయకం: ఎమ్మెల్యే



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్‌గా సీహెచ్ నాగమల్లేశ్వరరావు స్ఫూర్తిదాయకమైన సేవలు అందించారని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) కొనియాడారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం కమిషనర్ పదవీ విరమణ సభ జరిగింది. ఈసందర్భంగా నాగమల్లేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన మున్సిపల్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, కౌన్సిలర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పెనుగంచిప్రోలు చెరువు



ముండ్లపాడు-పెనుగంచిప్రోలు రోడ్డులో చెరువు అలుగుల వద్ద వరద ఉధృతి

పెనుగంచిప్రోలు:బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో శనివారం కురిసిన భారీ వర్షంతో మండలంలోని అన్ని గ్రామాలు జలమయమయ్యాయి. రోడ్లన్నీ వర్షపునీటితో మునిగి పోయాయి. రోడ్లు, పొలాలు కలిసి పోయి నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇళ్లకు పరిమితమయ్యారు. వరద నీటికి పెనుగంచిప్రోలు చెరువు నిండుకుండలా మారింది, కట్ట తెగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో రెవిన్యూశాఖ వారు స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ సత్రాల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. అలాగే వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆటోలో పెనుగంచిప్రోలు మండలం శనగపాడు వద్ద వాగు చప్టాపై కొద్దిగా నీరు వస్తుండటంతో ఒడ్డున పెట్టి అవతలకు వెళ్లాడు. వరద ఉధృతి పెరిగి ఆటో వాగులో కొట్టుకు పోయింది. ఆటోలో ఎవరూ లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ముచ్చింతాలలో పక్కనే ఉన్న పిల్లకాలువ గండిపడి ఎస్సీ కాలనీలోకి వరద నీరు చేరింది. మరో రెండురోజులపాటు తుఫాన్ ప్రభావం ఉంటుందన్న వార్తల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.